# పుణ్య పాపములు

**'పుణ్యస్య ఫల మిచ్ఛన్తి పాపం కుర్వన్తి మానవాః'** **(మహాభారతం)**

మానవులందరరూ పుణ్యఫలమునే కోరుకొందురు. కాని పాపములనే చేయుచున్నారు. అనగా పుణ్యపాపములన నేమియో తెలియకపోవుటచే వ్యతిరేక ఫలములను పొందుచున్నారు. ఈ కారణము వలననే...

**'హసతా క్రియతే కర్మ రుదతా చానుభూయతే'** **(శృతి)**

నవ్వుతూ కర్మలు చేయుచూ, ఏడ్చుచూ కర్మఫల మనుభవించుచున్నారు. పుణ్యఫలము సుఖమునిచ్చుట, పాపఫలము దుఃఖమునిచ్చుట అనునది నిర్వివాదాంశము.

**నళినీ దళమతి జలమతి తరళం తద్వజ్జీవిత మతిశయ చపలం**
**విద్ధి వ్యాధ్యభిమానగ్రస్తం లోకం శోక హతంచ సమస్తం** **(భజగోవిందం ద్వాదశమంజరీ)**

తామరాకుపై నీటిబొట్టు మెరుస్తూ, నిలకడ లేక ఎంత వేగముగా క్రింద పడిపోవుచున్నదో, యీ జీవితము కూడ రోగగ్రస్తమయి, అహంకారాభిమానములతో కూడుకొని, అనతి కాలములోనే అంతరించిపోవుచున్నది. ఈ విధంగా సమస్త లోకమూ శోకముతోనే హతమైపోవుచున్నదని జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యుల వారు లోక సత్యమును బహిర్గతము చేసియున్నారు. పుణ్యము కోసం ప్రయత్నించువారు కూడ శోకమునే అనుభవించుచున్నారంటే, సుఖమునిచ్చు పుణ్యమంటే ఏమిటో యీ లోకమునకు అర్థము కావటము లేదన్నమాట. కర్మల వల్ల పుణ్యము కలుగుతుందని భావించినచో పుణ్యఫలం నశించుట తోడనే మానవ లోకము గాని, **(క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి - భ.గీ.)** లేదా హీన జన్మలుగాని ఎత్తుదురని **(ఇమం లోకం హీన తరం వా విశన్తి - ముండకోపనిషత్)** శృతులు చెప్పుచున్నవి. పై విధంగా ఆలోచించినచో శాశ్వత సుఖమునిచ్చు పుణ్యకర్మలేవియూ లేవని అర్థమగుచున్నది. **అయినచో పుణ్యమనగా నేమి?**

**'సాత్వికీ పుణ్యనిష్పత్తి పాపోత్పత్తిశ్చ రాజసీ'** **(మనుస్మృతి)**

సత్వగుణము గలవారే పుణ్యాత్ములు, రజోగుణ ప్రధానులు పాపజీవులు.

**మరి సత్వమెట్లు లభించును?**

**తపసా ప్రాప్యతే సత్త్వం సత్త్వాత్సంప్రాప్యతే మనః**
**మనసా ప్రాప్యతే హ్యాత్మా హ్యాత్మా పత్త్యా నివర్తతే (మైత్రేయ్యుపనిషత్ 1-6)**

తపస్సు వలననే సత్వగుణము కలిగి, సత్వగుణము వలన మనసు నిర్మలమై, స్వాధీనమై, అట్టి నిర్మల మనస్కులకు ఆత్మ సంప్రాప్తమై, సంసారము నివర్తింప బడుచున్నది. తపస్సు అనగా... 'తప్యతే ఇతి తపః' అగ్నిచే మలినములను దగ్ధమొనర్చుకొనుటయే తపస్సు.

**యోగాగ్నిర్దహతి క్షిప్రమశేషం పాపపంజరమ్**
**ప్రసన్నం జాయతే జ్ఞానం జ్ఞానాన్నిర్వాణమృచ్ఛతి (ఈశ్వరగీత-కూర్మ పురాణం)**

యోగాగ్ని వలన నిర్విశేషముగా పాపములు అంతరించిపోవును. అనగా యోగాగ్ని వలన శరీరము, మనస్సు శుద్ధమగుటచే జ్ఞానము కలిగి, జ్ఞానము వలన మోక్షమును పొందుచున్నాము. మనము ఏయే కర్మలు చేయుచున్నామని ఆక్షేపించుట కంటే, కర్మలను ఏ విధంగా చేయుచున్నామని విచారించుట ప్రధానము. కర్మృత్వ అహంకారములతో ఎంతటి గొప్ప కర్మలు చేసిననూ ఫలితము వ్యతిరేకముగా నుండును. నహుషుడు, నృగుడు అను మహారాజులు అశ్వమేధ యాగములు, సువర్ణదాన గోదాన భూదానములు చేసియూ స్వర్గలోకప్రాప్తి పొందియూ, అహంకారముచే సప్తర్షులనే బాధించి కొండచిలువ, ఊసరవెల్లి జన్మలెత్తినట్లు భారతములో కలదు. కావున, చేయు కర్మ కంటే, కర్మ చేయు విధానము ముఖ్యమైనది.

**చిత్తశుద్ధి కలిగి చేసిన కర్మంబు**
**కొంచమైన నదియూ కొదువ కాదు**
**కొండ అద్దమందు కొంచమై ఉండదా**
**విశ్వదాభిరామ వినుర వేమ (శ్రీ యోగి వేమన పద్యం)**

**యదేవ విద్యయా కరోతి శ్రద్ధయా**
**ఉపనిషదిదం తదేవ వీర్యవత్తరం భవతి (ఛాందోగ్యోపనిషత్ 1-1-10)**

ఏ కర్మనైననూ శ్రద్ధతో, విధివిధానముతో, జ్ఞానముతో చేసినచో అది ఫలవంతమగుచున్నది.

**ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థాః మధ్యేతిష్ఠన్తి రాజసాః**
**జఘన్యగుణ వృత్తిస్థాః అధో గచ్ఛన్తి తామసాః** **(భ.గీ. 14-18)**

సత్త్వ గుణము కలవారు ఊర్ధ్వ లోకములను, రజో గుణము కలవారు మధ్యలోకములగు మానవ లోకమును, తమో గుణము కలవారు అధోలోకములను పొందుచున్నారని చెప్పుటచే, మనము పొందు కర్మఫలము మనలో గుణముల ననుసరించి, అనగా మనలో గల జ్ఞానము ననుసరించి యుండునని తెలియుచున్నది. జ్ఞానము వలననే శాశ్వత బ్రహ్మానందము లభ్యమగుచున్నది. ఈ అపరోక్ష జ్ఞానము కూడ యోగము ద్వారా అజ్ఞానము నశించుట వలననే కలుగుచున్నది.

**'యోగాత్ సంజాయతే జ్ఞానం'** **(త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్ -16)**

మరియూ, యోగ రహిత శాస్త్ర జ్ఞానము, మోక్షమునకు ఉపయోగపడదు.

**'యోగేన రహితం జ్ఞానం న మోక్షాయ భవేద్విధే'** **(యోగశిఖోపనిషత్ 1-9)**

కావున పుణ్యమనగా శాశ్వత సుఖమును ప్రసాదించు జ్ఞానము. పుణ్యకర్మ అనగా జ్ఞానమును కలుగజేయు యోగకర్మ.

**తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విన్దతి** **(భ.గీ. 4-38)**

పాపమనగా అజ్ఞానము.

**'సర్వానర్థ హేతుః ఆత్మానవ బోధ ఏవ'** **(శ్రీ సురేశ్వరాచార్య విరచిత నైష్కర్మ్య సిద్ధి)**

సర్వ దుఃఖములకు కారణము ఆత్మను తెలుసుకొనలేకపోవుటయే (అజ్ఞానము). జ్ఞానము కోసము ప్రయత్నము చేయక, తత్కాల శోభనిచ్చు వైదిక కర్మలనే ఆచరించుచూ, అవియే పుణ్యకర్మలని భావించుచూ, జననమరణ రూప సంసార చక్రంలో పడిపోవుచున్నారు. జ్ఞానము లేనప్పుడు నివృత్తి మార్గములో పయనించిననూ, అది మనలను ప్రవృత్తి యందే పడవేయుచుండును. అటులనే జ్ఞాని, ప్రవృత్తిరూప కర్మలనాచరించిననూ, నివృత్తి ఫలమునే పొందును. అతనిని సంసార ఫలము అంటుకొనజాలదు.

**నివృత్తి రపి మూఢస్య ప్రవృత్తి రుపజాయతే**
**ప్రవృత్తి రపి ధీరస్య నివృత్తి ఫలభాగినీ** **(అష్టావక్ర గీత 18-61)**

కావున పుణ్య పాపములు మన జ్ఞానము ననుసరించియే యుండును.

**దేహోఽహమితి సంకల్పో మహాపాపమితి స్ఫుటమ్**
**దేహోఽహమితి యద్ జ్ఞానం తదేవ నరకం స్మృతమ్** **(తేజ బిందూపనిషత్ 90-96)**

అజ్ఞానముచే 'ఈ దేహమే నేను' అని భావించుటయే మహాపాపమనియూ, అట్టి అజ్ఞానమే నరక ప్రాప్తిని కలుగజేయుచున్నదనియూ శ్రుతి భావం. ఈ విధంగా పుణ్య పాపముల వివరములు తెలియక, మనకు అపూర్వముగా లభించే యీ మానవ జన్మను పుణ్యము కోసము సాధారణ కర్మల యందు వృధా పఱచుకొనుటచే, ఇతర జీవులవలె అజ్ఞానవశులై అసద్యోనుల యందు పుట్టుచుందుమని తెలియనగుచున్నది.